# అక్కయ్య



“రవిగారికి,

నమస్తే. మీ ఉత్తరం అంది నన్ను నిరాశా నిస్పృహాలతో నింపివేసిందని మీకు నేను వేరేగా చెప్పక్కర్లేదనుకుంటాను. చిత్రకారులుగా పేరు పొందిన మీరు, గొప్ప వటుకులుగాకూడా [illegible] గురించే మీ ఆత్మవిశ్వాసం ఎదుటివ్యక్తి హృదయంలో [illegible] ఒక బల్లెన్నపోటువంటిదని మీరు గుర్తించలేకపోయినందుకు విచారంగా ఉంది. మీరు స్వప్నజగత్తులోని సౌందర్యాన్ని జీవకళలతో ప్రతిబింబింపచేయగలరేమో గాని, నటిత [illegible] ఉన్న. [illegible] చెప్పుతున్న [illegible] న్నాయుగని, ఇంత [illegible]ంగాకూడా ఉండగలదని ఊహించలేకపోతున్నాను.

వివాహమనే స్త్రీపురుషుల పవిత్ర బంధాన్ని ఒక నవ్వులాటగా, స్వార్థబుద్ధితో బొమ్మలపెళ్లిగా [illegible]ంగా ఉంది. [illegible] కార్యానైనా, కుంచె, రంగులు, కాన్వాసులలాగ ఒక నమూనాగా ఉపయోగపడ్డానుగాని,

మీ జీవితంలో భాగం ఏర్పరుచుకోలేకపోయిన నా దురదృష్టానికి ఏం చెప్పను? నా సౌందర్యానికి నాచేతే వెలకట్టించ సమకట్టిన మీ సాహసానికి నా జోహారులు. కాని మీరు నాకు ఏ విధంగాను డబ్బు ఇవ్వనక్కరలేదు. ఇవ్వ నవసరము రాదుకూడా.

అనాదిగా భారతదేశంలో వాడుకగా వస్తున్న స్త్రీ కన్నీరే నాకు ఈనాడు దొరికిన వరం. మీరు పన్నిన వలలో నిస్సహాయంగా చిక్కుకున్న నేను, నవమాసాలు కని పెంచిన మాతృహృదయాన్ని నొప్పించలేక జీవచ్ఛవంలా నా మనుగడ వెళ్లదీయబోతున్నాను. మలుపు తిరిగిన జీవితంలో మధుర స్మృతులను ఎదుర్కొంటానను కున్న నాకు మసిపూసిన మాయ వికటాట్టహాసం వెక్కిరిస్తూ కనిపించింది.

పెళ్లి అంటే ఏవగించే మీకు, మరోపెళ్లి చేసుకోవాలని ఆశలేని నాకు విడాకుల చట్టం అన్వయించక పోయినా ఫర్వాలేదు. భార్య అందాన్ని చాటబోయిన మీ విశాలహృదయ భావాలను చదవబోయిన నేను, భార్యకు మీ రిచ్చిన తృణమాత్రపు విలువ తెలుసుకుని ఆశ్చర్యపడక చేసే దేముందని?

ఉత్తరం ఆశించని
నిర్భాగ్యురాలు,
మాధవి."

సుదీర్ఘమయిన జాబు చదువుకున్న రవి మనస్సున పట్టిన మాలిన్యాన్ని దులుపుతున్నట్లు తలను ఒక్కమారు గట్టిగా విదిల్చాడు. తెలియకుండానే సన్నని నిట్టూర్పు వెలువడింది. ఎదురుగుండా కాన్వాసుపై మాధవి ఆకృతి దీనంగా కనిపించింది. "ప్చ్! ఎవరి స్వార్థం వాళ్లది. ఒకవేళ తన కా ఉద్దేశ్యమే కనక ఉండి ఉంటే శాంతను వివాహమాడేవాడుకాడా? బాధలు కల్పించడం మానవసహజం. బాధపడడంకూడ మానవసహజమే కదా మరి? ఎవరి ఖర్మ వాళ్లది." ఉత్తరం మడిచి డ్రాయర్లో పడేసి మాధవి నమూనాతో వేసిన "వరూధిని" అనే చిత్రానికి తుదిరేఖలు గీయడం మొదలుపెట్టాడు. ఈ చిత్రాన్నే అంతర్జాతీయ చిత్రకళా ప్రదర్శనానికి పంపించాలని ప్రయత్నిస్తున్నాడు. అందులో మాధవి ముగ్ధమనోహరరూపంలో జీవకళలు తొంగిచూస్తున్నాయి. ఆ చిత్రం రవివర్మ చిత్రానికి పోటీపడుతూంది అన్నివిధాలా.

ఆ చిత్రాన్ని చూస్తూ తన్మయుడయి పది నిమిషాలు అలాగే నిలుచుండిపోయాడు. వెనకగా వచ్చిన శాంత, మాధవి తైలవర్ణ చిత్రం చూసింది. ఆమె అసమాన సౌందర్యానికి కొస్తంత ఈర్ష్య కలగకపోలేదు. కాని క్షణంలోనే వర్తమానం జ్ఞాపకంవచ్చింది. వర్తమానంలో ఆ చిత్రం మూలమూర్తికి పట్టిన దుర్గతికి శాంత హృదయం రోదించింది. స్త్రీగా ప్రతీకారం చెయ్యమని స్త్రీహృదయం పురికొల్పుతూంది. కాని రవి అమాయికత్వాన్ని తెలుసుకుని స్త్రీ సున్నితమయిన మనస్సు కఠినంగా శిక్షించనియ్యడంలేదు.

"ఏమిటే, రవీ, అంతలా మైమరచిపోయావూ?" నెమ్మదిగా అంది.

"ఈ చిత్రం ఎలా ఉంది, శాంతా?" అన్నాడు ఆమెవైపు తిరగకుండానే.

"చాలా బాగుంది. తప్పకుండా నీకు ప్రథమ

**మహిళలో ఒక్కొక్కప్పుడు ఆదర్శం మహోన్నత శిఖరాలనే అతిక్రమించగలదు. నైరాశ్యం ఎదురయినా ఆత్మాహుతితో ఇతరుల మేలు కోరగల శక్తిసామర్థ్యాలు స్త్రీకి వెన్నతో పెట్టిన విద్యలు.**

బహుమతి వస్తుంది" అంది హర్షంగా.

"వాళ్లు ఇవ్వకపోయినా ఫరవాలేదు. నా మనస్సుకి చాలా తృప్తికరంగా ఉంది ఈ చిత్రం" అన్నాడు తృప్తిగా చూస్తూ.

"కాని ఈచిత్రం తాలూకు అసలు వ్యక్తిమాత్రం అంధకారంలో అలమటిస్తూందనుకుంటాను, పాపం!" సానుభూతి చూపించింది.

తలఎత్తి శాంత కళ్లలోకి చురుగ్గా చూశాడు. ఏమీ మాట్లాడకుండా ఊరుకున్నాడు.

"అయినా, రవీ, నువ్వింత అన్యాయానికి ఒడిగడతావనుకోలేదు. అమాయికురాలైన ఆ పల్లెటూరమ్మాయిని నీ చిత్రంకోసం పెళ్లాడావా? ఆ తరవాత విడాకుల చట్టమా? అమాయికులను మోసగించి బాధిస్తే ఆ ఉసురు నీకు తగలకపోదు." బాధపడుతూ ఆశ్చర్యపోతూ అంది.

"శపిస్తున్నావా?" బొమముడి వేశాడు.

"కాదు. అర్థంచేసుకోమంటున్నాను." ప్రార్థించింది.

"ఎందుకు? అనవసరం" నిష్కర్షగా చెప్పేశాడు.

ఒళ్లు మండింది శాంతకు. అయినా తమాయించుకుంది.

"కాదు, రవీ! కాస్త అర్థంచేసుకో. నీ చిత్రలోకం లోనించి ఈ భూలోకంలోకి వచ్చి యథార్థాన్ని యథార్థంగా చూడు. ఒక గౌరవనీయవంశంలోని స్త్రీ నీకు ఆటవస్తువుగా ఎలా కనబడింది? స్త్రీకి నువ్వు ఇచ్చే విలువ ఇంత సంకుచితమయినదా? ఇలాంటి తెలివితక్కువ అవకతవకపు పని, ఇంత సాహసంగా నువ్వు చెయ్యగలవని, క్రియ జరిగిన తరవాతకూడా నేను నమ్మలేకపోతున్నాను. స్త్రీ హృదయం అర్థం చేసుకోగలిగిఉంటే నువ్వు ఇంత అనర్థానికి తలపడేవాడివికావు. సాటి స్త్రీకోసం స్త్రీగా కోరుతున్నాను, రవీ, నా మాట విని ఆమెను తెచ్చుకో. నీ చిత్రకళకు, సౌందర్యారాధనకు ఏమాత్రము-అడ్డురానని నేను హామీ ఇస్తాను. స్త్రీ సౌందర్యారాధనమాత్రమే కాదు, స్త్రీ హృదయాన్నికూడా అర్థంచేసుకో. అమాయికమైన ఆమె కళ్లలోని దీనాలాపాన్ని అర్థంచేసుకో, రవీ, అర్థం చేసుకో!" బాధగా వేడుకొంది.

"ఆ కోరికే కనక ఉండిఉంటే ఎప్పుడో నేను నిన్ను పెళ్లిచేసుకునిఉండేవాడిని. పిల్లలుకూడా పుట్టిఉందురేమో!" హేళన చేశాడు.

శాంత ముఖం ఎర్రబారింది. ఏం మాట్లాడలేదు.

పి. విమల

అక్కడేఉన్న ఒక కుర్చీలో కూర్చొని ఆలోచించసాగింది.

'ఎంత తేలికగా చెప్పేశాడు! నాటకంలోకూడా నటించగల సామర్థ్యం ఉందని మురిసిపోతున్నాడు. ఇతడి నేమనాలి? ఇది అజ్ఞానమా? అమాయికతా? మూర్ఖత్వమా?'

ఆలోచనాధీనురాలైన శాంతను రెండు క్షణాలు పరీక్షగా చూసి కిందికి దిగి వెళ్లాడు రవి.

సాధారణంగా ఒకరి వస్తువు వేరొకరు పొందినప్పుడు ఈర్ష్యాసూయలు చోటు చేసుకుంటాయి. కాని ఇవే కొన్ని విపరీత పరిస్థితులలో ఆదరాభిమానాలుగా కూడా మారడానికి అవకాశాలు ఉన్నాయి, ముఖ్యంగా మనుష్యునిలోని మానవత్వం చావనప్పుడు. వివేకం విజ్ఞానానికి తోడ్పడినప్పుడు, మానవునిలోని మంచితనం చెడుని పారద్రోలినప్పుడు, నిస్వార్థత స్వార్థాన్ని అణిచివేసినప్పుడు మమత చోటు చేసుకుంటుంది.

అనాలోచితంగా డ్రాయరు సొరుగు తీసిన శాంతకి మాధవి ఉత్తరం కంటపడింది. ఆత్రంగా తీసి చదివింది. శాంతలోని సంచలనం మళ్లీ చెలరేగింది.

'తనెవరు? ఆమె ఎవరు? తన సొత్తు అనుకున్న రవిని ఆమె అజ్ఞానంతో అపహరించిందే? అయితే ఆమెమీద తనకు జాలి ఎందుకు, కసి కలగాలిగానీ!

'ఛీ, ఛీ! అదేం మాట? సాటి స్త్రీ, అదీ పల్లెటూరి అమాయికురాలు, అభం శుభం తెలియని వయస్సులో పట్నవాసపు మోసానికి ఎరఅయింది. ప్రపంచజ్ఞానం బొత్తిగాలేని ఆ అమ్మాయి ఈ కలుష ప్రపంచంలో ఆధారం లేకుండా ఎలా మనగలుగుతుంది? వివాహం అన్న తరవాత వివాహమే! తెలిసి, లేక తెలియక చేసుకున్న సంసారాన్ని నడపక తప్పదు. స్వార్థసిద్ధికై పవిత్రమైన వివాహపు బంధంతో ఆడలాడతాడా? అదీ ముద్దరాలయిన పల్లెటూరి అమ్మాయితోనా! సాటి స్త్రీగా నేనీ అన్యాయాన్ని సహించరాదు. ఏమయినాసరే ఆ అమ్మాయి సంసారం చక్కబెట్టేందుకు నేను ప్రయత్నం చేస్తాను.' కృతనిశ్చయురాలయింది.

గబగబా కిందికి దిగి వచ్చింది. రవి ఎదురయినా పలకరించలేదు.

వారంరోజులుగా శాంతకోసం రవి ఎదురు చూశాడు. కాని, రాలేదు. మాధవి విషయమయి శాంతకు ఎక్కువ కోపం వచ్చిందని తెలుసుకున్నాడు. మాధవి విషయంలో శాంతకు ఇంత పట్టుదల ఎందుకో అర్థంకాలేదు. విచిత్రమైన వ్యక్తి అని అనుకున్నాడు మనస్సులో. ఆ చంచల హృదయునికి అకస్మాత్తుగా మాధవిని చూడాలని బుద్ధి పుట్టింది. వెంటనే సూటుకేసులో రెండు జతల బట్టలు వేసుకుని బయలుదేరాడు.

శాంత ఎదురువచ్చింది. ముఖం చాలా పీక్కుపోయింది. రెండు మూడు రోజులుగా ఆహారం లేనట్టుంది శాంత వాలకం. విస్తుపోయాడు రవి. కారణం అంతుపట్టలేదు.

"ఏం శాంతా, అలా ఉన్నావు? ఒంట్లో బాగోలేదా?" అని అడిగాడు ఎదురుగా వెళ్లి భుజం పట్టుకుని ఊపుతూ.

"బాగుంది. కానీ ఎక్కడికో ప్రయాణం?" ముభావంగా మూతి ముడుచుకుని అడిగింది.

"మాధవి ఊరికి. వస్తావా వెళదాం?" నంతో

AG.33 TL

# నొప్పిని అతిశీఘ్రంగా తొలగించడానికి 'ఆస్ప్రో' మాత్రమే మైక్రోఫైన్‌డ్ చేయబడినది




వీటికోసం క్రొత్త మైక్రోఫైన్‌డ్ 'ఆస్ప్రో'ను వాడండి: నొప్పి • తల నొప్పి • ఒళ్ళు నొప్పి • ఫ్లూ • జ్వరముతో కూడిన జలుబు • కీళ్ళ నొప్పి • గొంతుక నొప్పి • పంటి పోటు

మోతాదు: పెద్దవారికి: రెండు బిళ్ళలు. అవసరమైతే మళ్ళీ వేసుకోండి. పిల్లలకు: ఒక బిళ్ళ, లేక డాక్టర్ సలహా ప్రకారము వేసుకొనవలెను

క్రొత్త మైక్రోఫైన్‌డ్ 'ఆస్ప్రో' నొప్పిని నివారించుటకు, ఇప్పుడు మీకు లభించే వాటిలో అతి ఆధునికమైన సాధనము.



క్రొత్త మైక్రోఫైన్‌డ్ 'ఆస్ప్రో' అతి శీఘ్రముగా నొప్పిని తొలగించును

నికోలస్ (N) తయారు


షిస్తుందని ఉత్సాహంగా చెప్పాడు.

"ఎందుకూ? మనుష్యులకు ఈమాత్రంకూడా స్తిమితంగా బ్రతికే అవకాశం లేకుండాచేయడానికా?" కఠినంగా అంది.

విస్తుపోయి చూశాడు. "అదికాదు, శాంతా!...."

"ఏది కాదు? ముందర ఇది తీసుకోండి. మీకు కొద్దిరోజులలోనే కోర్టునుండి పిలుపు రావచ్చు" అంది గంభీరంగా.

"ఎందుకు?"

"ఎందుకా? కోరి చేసుకున్న భార్యను అకారణంగా వదిలేసినందుకు."

"ఎవరు? మాధవి వేస్తోందా?"

"కాదు. మాధవి తరఫున నేనే వెయ్యదలుచుకున్నాను. ఇంక సెలవ్." తిరిగెళ్ళిపోయింది.

అచేతనంగా నిలబడిపోయాడు. శాంత ఇంత వరకు ఎందుకు తెగించిందా? నమ్మలేకపోతున్నాడు. చేతిలో పెట్టిన కాయితం విప్పి చూశాడు.

"తెలియని అమాయికులకు, తెలిపిన విజ్ఞానవంతులకు తెలియజెప్పడం సులభం. కాని తెలిసీ తెలియని మూర్ఖులకు తెలియచెప్పడం మూర్ఖత్వమే మరి" అని వ్రాసిఉంది.

అంటే? శాంత తిరుగుబాటుతో మొద్దుబారిన బుర్ర సరిగా ఆలోచించలేకపోయింది. ఎవరిని ఉద్దేశించి వ్రాసిందోకూడా ఆలోచించలేకపోయాడు. అమాయికుడు. స్వప్నజగత్తులో, సౌందర్య ప్రకృతిలో సౌందర్యాస్వాదన చేసే చిత్రకారుడికి నిజజీవితంలోని అర్థాలు తేలికగా బోధపడలేదు.

స్వయంగా మాధవే ఆ విధంగా దావా వేస్తే అంత బాధ అనిపించేదికాదు. కాని, శాంత! తను నమ్మిన, తన దేవత శాంత తనను మోసగిస్తుందా? తనకు ఎదురుతిరిగి, అపఖ్యాతి, అప్రతిష్ఠ తెస్తుందా? ఉడుకుమోతుతనం కలిగింది ఆ మృదుహృదయునికి.

ఏదో ఒకటి వెంటనే చెయ్యాలనే ఉక్రోషం కలిగింది. పరిగెత్తుకుంటూ గదిలోనికి వెళ్ళాడు. ఎదురుగా మాధవి చిత్రం కనిపించింది. అంతటికీ మూలకారణం నువ్వే అన్నట్టు కసిగా చూశాడు. కసిగా ఉత్తరం వ్రాయాలనుకుని కాయితం, కలం తీసుకున్నాడు. తలఎత్తి చూసేసరికి మాధవి తైలవర్ణ చిత్రం దీనంగా కనిపించింది. వివేకం కొద్దిగా మేల్కొంది. 'అవును. దీనిలో మాధవి ప్రమేయం ఏముంది, అంతా శాంత మొండితనం కాకపోతే? ఈతిక్క ఇలాకాదు కుదర్చడం. వెంటనే మాధవిని రప్పించి శాంత మొహం చూడకూడదు!' అనుకున్నాడు తిక్క రేగిన రవి.

* * *

వాకిట్లోకి వస్తున్న అల్లుణ్ణి చూసి ఆదరంగా ఆహ్వానించారు సావిత్రమ్మగారు. లోపలికి వచ్చి కూర్చుని దిక్కులు చూడసాగాడు రవి గోళ్ళు గిల్లుకుంటూ. సావిత్రమ్మ అడిగిన ప్రశ్నలకు పొడిపొడిగా సమాధానాలు ఇచ్చాడు. రేవుగట్టునించి నీళ్ళు తీసుకు వచ్చిన మాధవి రవిని చూసి అవాక్కయింది. కాళ్ళు తడబడుతూంటే ఎలాగో లోపలికివెళ్ళి కూలబడిపోయింది. మనస్సులో ఆలోచనావలయం గిర్రున తిరుగుతూంటే, మనస్సును

స్వాధీనపరుచుకోలేక నిశ్శబ్దంగా దుఃఖించసాగింది.

'మళ్లీ ఎందుకు వచ్చినట్టు? తనదగ్గిర ఇంకేం ఉంది? ఈ మాత్రంగా అన్నా బ్రతకనీయదలుచుకో లేదా? ఇంకా ఎంత బాధించ దలుచుకున్నారు? వారి నాటకం ఇంకా ముగియలేదా? చిత్రనిర్మాణం ఆగి పోయిందని వచ్చారా?' మాధవి మనస్సు ఆక్రోశించింది క్షోభతో.

"అమ్మా, మాధవీ, అల్లుడికి కాఫీ తీసుకెళ్లమ్మా" తల్లి పిలిచింది. వెళ్లక తప్పలేదు. 'హుఁ . . . అల్లుడు!' అనుకుని తీసుకెళ్లింది.

కాఫీ తీసుకువస్తున్న మాధవిని పరీక్షగా చూశాడు రవి. 'అప్పటికి ఇప్పటికి చాలా మారిపోయింది మాధవి' అనుకున్నాడు. సంవత్సరకాలంలోనే పదిసంవత్సరాల పెద్దతనం తెచ్చుకుంది. మనిషి చిక్కిపోయింది. శరీరం నల్లబడింది. బుగ్గలు పీక్కుపోయి కళ్ళు పొడుచుకు వస్తున్నాయి. అయినా సహజసౌందర్యం ఇనుమడించిందే గాని తగ్గలేదు. నిరాశలోని వేదాంతితత్వం కళ్లలోకి నూతన తేజస్సు తెచ్చింది. మాధవి కళ్లలోని నైరాశ్యపు చూపులకు త్రుళ్లిపడ్డాడు.

"మాధవీ!" మధురంగా పిలిచాడు.

'ఏమిటన్నట్లు' కర్కశంగా చూసింది.

"నన్ను క్షమించు, మాధవీ! నిన్ను నేను తీసుకుపోదా మని వచ్చాను"-ఎంతో మృదువుగా అన్నాడు.

"ఇంకా మీ చిత్రీకరణ పూర్తికాలేదా?" వ్యంగ్యంగా పలికింది.

"దానికికాదు, మాధవీ! నా ధర్మపత్నిగా, జీవిత భాగస్వామిగా, తోడునీడగా, సహచారిణిగా పిలుస్తున్నాను!" ఆవేశంగా అన్నాడు.

"ఇంక మీ నాటకంలో భాగం పంచుకోలేను. మోసం చెయ్యడం సులభం. కాని మోసగించబడిన వారిని నమ్మించడం చాలా కష్టం." కఠినంగా అంది. వెళ్లిపోతూ మళ్లీ వచ్చి అడిగింది.

"ఇందుకోసమే వచ్చారా?"

నిస్సహాయంగా చూశాడు రవి.

"అయితే తక్షణం తిరిగిపోవచ్చు." లోపలికి వెళ్లి పోయింది.

రవి స్తబ్దుడయ్యాడు. తల కొట్టివేసినట్లు అయింది. ఇంటికి వచ్చాడు. ఆలోచనలు పదేపదే ప్రశ్నిస్తున్నాయి. తను చేసిందేమిటి? ఎలా చేశాడు? అనేదే అర్థంకావటంలేదు అతనికి. అప్పుడే శాంత వచ్చింది. కలవరంగా, విచారంగా ఉన్న రవిని చూసి 'ఏం జరిగిఉంటుందబ్బా?' అనుకుంది.

శాంతను చూసిన రవికి అవమానం దహించి వేసింది. మింగేట్టుగా చూసి తల అసహ్యంతో విదిలించు కుని పోబోయాడు.

"రవీ..." నెమ్మదిగా పిల్చింది.

"ఏం? ఇంకా నీ కసి తీరలేదా?" ఉక్రోషంగా అన్నాడు.

"వేసుకునే దావా ఏదో వేసుకుని విజయం సాధించ రాదూ?" వ్యంగ్యంగా కోపంగా అరిచాడు.

ఆలోచిస్తూ అడిగింది శాంత: "రవీ, ఈ చిత్రం ఒకమా రిస్తావా?"

"తీసుకుపో! నా కళ్లఎదట కనపడకుండా తీసుకుపో!" గట్టిగా కసురుకున్నాడు.

శాంత శాంతం రవి ఆగ్రహానికి ఆజ్యం అయింది.

"ఎందుకు, రవీ, అలా గొంతు చించుకుంటావు? నాకేమీ చెవుడు లేదులే." చాలా నెమ్మదిగా అంది.

"కాని నాకే బ్రహ్మచెముడు." గట్టిగా కసిగా అరిచాడు.

మౌనంగా వెళ్లిపోయింది శాంత.

మనస్సు బాగాలేకపోవటంవల్ల ఏదన్నా పుస్తకం చదువుదామని తీశాడు. కథలో బాధతో కుంగిపోతున్న భర్తకు భార్య ఓదార్పులో కలిగే శాంతిని వర్ణించాడు రచయిత. 'తనకుకూడా ఓదార్చేవాళ్లు ఇప్పుడు ఉంటే ఎంత బాగుణ్ను!' అనుకున్నాడు బాధగా.

* * *

గుర్తులు తెలిసికొని వెళ్లింది మాధవి ఇంటికి. మాధవి తల్లి మాధవిని కాబోలు తిడుతూంది.

"ఎందుకే వచ్చిన అతన్ని మాట్లాడించకుండా పంపించేశావు? నీ కిదేం బుద్ధే?" నోరు నొక్కు కుంటూంది.

"కాదమ్మా! ఏదో అర్జంటు పనిమీద వచ్చి వెళ్లిపోయారు" అంది బలవంతంగా ఏడుపు దిగమింగు కుంటూ.

"మళ్లీ ఎప్పుడు వచ్చి నిన్ను తీసుకువెళతానన్నారు?"

"ఏమో? తెలీదు" అంది నిర్లిప్తంగా.

"బాగుందే తల్లీ!" అని విడ్డూరపడింది మాధవి తల్లి.

"మాధవిగారున్నారామ్మా?" అంటూ వచ్చింది శాంత.

బయటికి వచ్చి చూసింది మాధవి "ఎవరా?" అని.

శాంతను గుర్తుపట్టలేకపోయింది. కలతపొందిన మనస్సు త్వరగా గుర్తించలేదు కదా మరి?

"ఎవరా అని ఆశ్చర్యపోతున్నారా? మీ భర్తగారి ఇంట్లో చూశారుగా. అప్పుడే మరిచిపోయారా? ఇది మరీ అన్యాయం" అంది నవ్వుతూ కలుపుగోలుతనంగా.

తేరుకుని "రండి" అని లోపలికి ఆహ్వానించింది. 'తనతో ఏం పనిఉండి వచ్చిందబ్బా?' అనుకుని ఆశ్చర్య పడిపోతూంది.

"ఈవైపు పనిఉండి వచ్చాను. అలాగే మీరు ఇక్కడ ఉంటారేమో చూసిపోదామని వచ్చాను" అని తన రాకకు కారణం తెలిపింది.

కాఫీ ఫలహారాలయిన తరవాత అడిగింది మాధవిని గదిలోకి పిలుచుకుపోయి.

"మీరు అత్తారింటికి ఎప్పుడు వెళతారు?"

"అంత భాగ్యానికి నోచుకోలేదుగా!" బాధగా చెప్పింది.

"అదేం?" ఏమీ తెలీనట్లు అడిగింది శాంత.

"మీకేం తెలీదా? నిజంగా?" అంది సగం ఏడుపుతో, సగం ఆశ్చర్యంతో.

ఇంక దాచడం ఎందుకని అసలు విషయంలోకి వచ్చేసింది శాంత. "అసలు ఇందుకోసమే వచ్చాను. మీరు చాలా అమాయికంగా ఉన్నారని అలా మోసం చేస్తే మీరు ఎందుకు ఊరుకుంటారు?" అంది ఆవేశంగా.

"ఊరుకోక ఏం చెయ్యాలని? ఊరంతా దండోరా వేయించమంటారా? మగదిక్కు లేని మేము ఏమని







చెయ్యగలం?" నిరాశతో, నిస్పృహతో జవాబు ఇచ్చింది.

"ఛ ఛ, అలా నిస్పృహపడితే ఎలాగ? లక్షణంగా పెళ్ళిచేసుకున్న వ్యక్తి కారణం లేకుండా ఎలా వదిలివేస్తాడు? మరీ ఇంత అమాయికులుగా ఉండకూడదు మరి!" అంది ధైర్యం చెబుతూ.

"మీ రనేదేమిటో నా కర్థంకావటం లేదండీ" అంది ఆశ్చర్యంగా శాంతవైపు చూస్తూ, సగం విసుక్కుంటూ.

"అదికాదమ్మా, రవిని సరిఅయిన మార్గంలోకి తీసుకురావడానికి మీ రేమన్నా ప్రయత్నించారా?"

"ఇష్టంలేదు మొర్రో అంటే అతన్ని తలమీదికి ఎక్కించుకోమంటారా?" అంది విసుగ్గా.

"అలా విసుక్కుంటే ఎలా? ఆలోచించుకోవాలి. ఇది మీ జీవితానికి సంబంధించిన సమస్య. ఎన్నాళ్ళని ఈ విధంగా ఉండిపోతారు? రాలిపోయే పండు మీ తల్లి. ఆ తరవాత రెండు దశాబ్దాలు లేని మీారు ఈ కపట ప్రపంచంలో ఒంటరిగా జీవించగలరా?" అనునయించింది.

"ఎప్పుడైతే మా అమ్మ నన్ను విడుస్తుందో, ఆ క్షణంలోనే నేను ఈ ప్రపంచాన్ని త్యజిస్తాను. నాకు ఈపాటి భోగజీవితం అనుభవించాలని ఏమాత్రము ఆశలేదు. ఆ చింత మీ కెందుకు?" అంది కొంచెం కోపంగానే.

"భలేవారే అడిగేవారెవరూ లేరని అనుకుని ఆత్మత్యాగం చేద్దాం అనుకుంటున్నారా? అదేం కుదరదమ్మా! ఎప్పుడయితే రవి భార్య అయ్యారో, ఆనాడే నేను మీ అక్కయ్యనయ్యాను. నా చెల్లెల్ని నే నీ విధంగా వృథా పోనిస్తాననుకున్నారా?" అంది కొంచెం జబర్దస్తీగాను, చనువుగాను. శాంత కంఠస్వరంలోని అప్యాయతతో కూడిన అధికారానికి విస్తుపోయింది. దానితోపాటు దుఃఖం, సంతోషం రెండూ పెనవేసుకున్నాయి.

"అక్కయ్యా!" అంటూ గట్టిగా శాంతను కౌగలించుకుని బావురుమని ఏడ్చేసింది.

"అయ్యో పిచ్చితల్లీ! ఇంక ఇలా ఏడుస్తూ కూర్చుంటే ఏం ప్రయోజనం, కార్యం సాధించడానికి ప్రయత్నించాలిగాని. లే! లే!" అంది మృదువుగా తట్టుతూ.

ఎడారిలో ఒయాసిస్సులా, మండుటెండలో మంచి చల్లనినీరు దొరికినట్లుగా శాంత మాటలతో మాధవికి అమృతం చిలికించినట్లయింది. మునిగిపోతున్నవారికి అధారం దొరికినట్లు కాస్త ధైర్యం తెచ్చుకో ప్రయత్నించింది.

"అయితే నన్నేం చెయ్యమంటావు, అక్కయ్యా" అంది ఆశగా.

"మరేం మాట్లాడకుండా నాతో రా! రవి ఏలుకున్నాడా సరేసరి. లేకపోతే దావా వేద్దాం! ఆ సంగతి చెప్పే వచ్చాను. ఈ విధంగా వచ్చి దగా చేసినప్పుడు కూడా చేతకానివాళ్ళలా ఊరుకుంటే ఇంకేమన్నా ఉందా? రోజురోజుకి అన్యాయం ఎక్కువయిపోదూ? అబలలు అలుసయిపోరూ? మిగతా సంగతులన్నీ నేను చూసుకుంటాగాని, నువ్వు వస్తావా మరి?" అడిగింది శాంత.

మాధవి ఆలోచించుకుంది. ఎంత ఆలోచించినా ఇష్టంలేని వ్యక్తితో ఎలా కాపరం చెయ్యటం? కష్టంగా కనిపించింది. ఆ మాటే అడిగింది.

"అదికాదు, అక్కయ్యా! నేను బలవంతంగా ఉండి ఏం ప్రయోజనం? ఇష్టంలేదు. నేను సంసారం చెయ్యలేను అని ఒక మూల ఆయన మొత్తుకుంటున్నారుగా! ఇష్టంఉన్న సంసారాలే అంతంత మాత్రం. ఇంక ఇష్టంలేనిది వేరే చెప్పాలా? ఎందుకో నరకం కోరి తెచ్చుకోడం? ఉన్నన్నాళ్ళు ఆప్యాయంగా ఆదరించి ప్రేమించే అమ్మచాటున ఉండి ఆ తరవాత దేవునికే వదిలేస్తాను" అంది ఆలోచించి.

"ఏడిసినట్టుంది. నీ వేదాంతం కట్టిపెట్టు. మీ అమ్మదగ్గిరమాత్రం ఈ విషయం ఎన్నాళ్ళని దాచగలవు? తెలిసిన తరవాత నీ విధివ్రాతకు దుఃఖించకుండా ఉంటుందా? ఈ విధంగా భర్త వద్దిలేశాడని తెలిసిన తరవాత నీకు చుట్టుపక్కలవారిమధ్య ఉండే గౌరవం ఎటువంటిదో ఆలోచించుకోగలవా? ఆఖరికి తల్లికూడా ఒక్కొక్కసారి నోరు జారేయగలదు. ఆ సంఘ బహిష్కృతికన్న భర్తదగ్గిర నరకం ఎంతో నయం. అదీకాక నీ అందంమీద నీకు నమ్మకం లేకపోయినా నాకు బాగా ఉంది. అందాలమూటనైన నిన్ను దగ్గిర ఉంచుకుని ఏ మగాడు చలించకుండా ఉండగలడు? అయితే మొదటిరాత్రి చలించలేదేం? అని అడుగుతావేమో? అసలు కళాకారుల హృదయం విచిత్రమయినది. అర్థంచేసుకోడం కష్టం. ఎంత సున్నితంగా ఉంటారో అంత కఠినంగాకూడా ఉంటారు ఒక్కొక్క సమయంలో. అదంతా నీకెందుకు? నీ పనిలో విజయం సాధించే బాధ్యత నాది. సరేనా? ఇంక బయలుదేరు మరి అమ్మతో చెప్పి.

ఇంకోమాటకూడా, అమ్మాయి! అలా అని అతని చిత్రకళకుమాత్రం ఆటంకం కలిగించకూడదు. ప్రోత్సహించి సహాయపడమనేగాని అడ్డు కలిగించమని కాదు. అంతేకాదు. నీ సుఖంకూడా ఎరిగి ప్రవర్తించమని. ఆడవారిని ఆటవస్తువులుగా చూసే ఈ రవిలాటివారికి తప్పక బుద్ధి చెప్పాలి!" అంది శాంత.

"చాలా పెద్ద ఉపన్యాసమే ఇచ్చాను కదూ!" అంది తిరిగి శాంత నవ్వుతూ.

మాధవికూడా సన్నగా నవ్వి అడిగింది.

"మరి మీరొక విషయం చెప్పగలరా?" సందేహంగా అడిగింది.

"ఏమిటి?"


"మీరేమౌతారు వారికి?" కుతూహలంగా అడిగింది.

"నేనా?" దీర్ఘమయిన నిట్టూర్పు విడిచి చెప్పింది.

"ఒకప్పుడు ఆయనను మనసారా ప్రేమించి వాంఛించినదానను. కాని ఆయన భావాలను గ్రహించిన తరవాత ప్రేమించడంతోమాత్రం తృప్తిపడ్డాను. ఇప్పటికీ నేను ఆయనను గాఢంగా ప్రేమిస్తున్నాను:

## "లకోటా" ప్రశ్నలు

—లాంగ్టన్






అయితే నేను ప్రతిఫలంమాత్రం కోరటంలేదు దానికి'' అని మాధవివైపు చూసింది.

విచిత్రంగా చూసింది మాధవి. శాంత ఏమిటో అంతుబట్టలేదు.

''అయితే నా విచిత్రచర్యకు విస్మయపడుతున్నావు కదూ! ఈ నా నాలుగేళ్ల సాహచర్యంలో నేను ఆయనను బాగా అర్థంచేసుకున్నాను. ఆయనంత అమాయికులు ఎవ్వరు ఉండరు. కళాకారులని పేరు తెచ్చుకున్నారేకాని లోకజ్ఞానశూన్యులు. పసిపాపలాంటి అమాయికత, సున్నితత్వంతో కలిసి ఆయనలో నిండిఉంది. దానితో పాటే కొన్తంత దుడుకుతనంతోకూడిన మూర్ఖత్వమే ఈ వివాహానికి, ఈ విపరీత పరిణామానికి దారితీసింది. ఆయన ఎంత అమాయికులు అయితేనేం? అనాలోచితంగా చేసిన కార్యానికి సాటి స్త్రీ, అందులో అన్నెం పున్నెం ఎరగని పల్లెటూరి అమాయికవు అబల వంచించబడడం స్త్రీత్వం లోపించని ఏ స్త్రీ సహించలేదు. స్త్రీగా సాటి స్త్రీకి జరిగే అనవసర వంచన అరికట్టడం నా ధర్మం; న్యాయం. ఇల్లు అలకగానే పండుగకాదన్న విషయం మానవుడైన ప్రతి వ్యక్తి నేర్చుకోదగ్గ విషయం. కొందరు చూసి నేర్చుకుంటే, కొందరు అనుభవంమీద నేర్చుకుంటారు.

ముఖ్యంగా నువ్వు తెలుసుకోవలసినదేమంటే, పరిపక్వం చెందని మనస్సుతో ఆ వ్యక్తి స్త్రీ సాహచర్యాన్ని శాశ్వతరూపంలో స్వీకరించడానికి వెనకాడుతున్నాడు. తాను స్త్రీలోలుడై తన సౌందర్యారాధనను ఎక్కడ పాడుచేసుకుంటానో అని వివాహానికి విముఖత చూపించాడు. కాని దైవఘటనవల్ల నీతో వివాహమయింది. అతని పిరికితనాన్ని, అజ్ఞానాన్ని, బలహీనతను నీ సాహచర్యమహిమతో పోగొట్టాలి. స్త్రీ సాహచర్యం శారీరక సుఖాలేకాక మానసికంగాకూడా సుఖాన్ని సాధించగలదని నిరూపించాలి. ఇకమీదట నువ్వే తల్లిగా, భార్యగా, స్నేహితురాలిగా అన్నివిధాల పోషించి అతనిని ఒక ప్రసిద్ధ వ్యక్తిగా మలచవలసిన బాధ్యత స్వీకరించాలి.'' సలహాతో కూడిన అధికారంతో ఆజ్ఞాపించినట్టనిపించింది మాధవికి.

ఆశ్చర్యపోయింది శాంత మనోగతభావాలకు.

* * *

తన కథ అంతా వివిపించి సలహా కోరాడు లాయర్ చంద్రకాంత్‌ని రవి. అంతా విని తల విదిలించాడు చంద్రకాంత్.

''ఏం లాభం లేదయ్యా. మరీ ఇంత చవటకేసు తీసుకుంటే ఓడిపోవడం ఖచ్చితం. నీవైపు వాదించడానికి బలమయిన పాయింట్లు అసలు లేనేలేవు. ఏమనుకోకపోతే ఒక సలహా'' అన్నాడు చంద్రకాంత్.

''ఏమిటండీ?'' ఆత్రంగా అడిగాడు రవి.

''అయినా లక్షణంగా పెళ్లిచేసుకున్నవాడివి సుఖపడక కోర్టు కెక్కుతానంటావే, ఇదేం ఖర్మ చెప్పు.''

''అదికాదండీ. నేను ఎంతోమంది అమ్మాయిలతో తిరుగుతూఉంటే అనుమానం కలగడం సహజమా? కాదా? ఇంక ఈ అనుమాన పైత్యం వదిలించాలంటే నా కృషికి నేను తిలోదకాలివ్వవలసినదే. కళారాధన నా బహిఃప్రాణం. ఇదిమాత్రం నేను వదులుకోలేను.

నా కంఠంలో ప్రాణం ఉండేదాకా" అన్నాడు ఉద్విగ్నంగా.

"వాదించమంటే వాదిస్తానుగాని, గెలుస్తాననే నమ్మకమాత్రం కలిగించలేను. నీ ఇష్టం మరి" అన్నాడు చంద్రకాంత్.

"సరే. వస్తానండీ, లాయర్‌గారూ! ఆవిడగారిని రానీండి! ఏం సుఖం పొందుతుందామని వస్తుందో నేను చూస్తాను." కోపంగా అని విసురుగా వెళ్ళిపోయాడు.

"పాపం, అమాయకుడు" అనుకుని నవ్వుకున్నాడు చంద్రకాంత్.

* * *

ఇంటికి వచ్చి ఆలోచిస్తూ ఈజీఛైర్‌లో పడుకున్నాడు. శాంత వచ్చింది. రవికి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది. రవి ఎంతసేపటికి మాట్లాడక పోయేసరికి తనే మాట్లాడింది.

"మాధవిదగ్గరికి వెళ్లివచ్చాను."

గతుక్కుమన్నాడు. తను వెళ్ళిన సంగతి శాంతకు తెలిసిపోయిందేమో అనే అనుమానం కలిగింది. జవాబుగా ఏం మాట్లాడలేకపోయాడు. కాని శాంత చెప్పబోయేది జాగ్రత్తగా వినడానికి చెవులుమాత్రం బాగా రిక్కించుకున్నాడు.

"దావా వెయ్యమని చెప్పేసి వచ్చాను." పరీక్షగా చూస్తూ అంది.

"మంచిదే! ఏమందేమిటి?" అతి సాధారణమైన కుతూహలంతో అడిగాడు.

"ఊహుఁ, వెయ్యను. ఇష్టంలేనివారితో నేను కాపరం చెయ్యలేను. వారికి సంతోషంగా ఉంటే అంతే చాలు అంది."

"తెలివైనదే అన్న మాట!"

"మీకు అనుకూలంగా నడుచుకుంటే తెలివైనది. కాని నా భావనలో పట్టి చాదస్తురాలు. అథం కుథం తెలియని అమాయకురాలు. దురదృష్టవశాన మీ చేతిలో కీలుబొమ్మ అయింది" అంది గంభీరంగా.

"మధ్య నన్నెందుకు ఆడిపోసుకుంటావు? ఎలాగో నీవంటి ధీరురాలి అండ సంపాదించుకుందిగా. ఇంకేం భయం ఆవిడగారికి." హేళనగా అన్నాడు.

"తప్పకుండా నేను చెయ్యదగింది చేస్తాను. ఆమె తరఫున దావా నేనేవెయ్యదలుచుకున్నాను". బెదిరించింది.

*శాంత పట్టుదలతో కూడిన ముఖం చూసిన రవికి* కొంత జంకు కలిగింది. 'శాంత నిజంగా దావా వేస్తే ఓడిపోవడం తథ్యం. అదీకాక ఈ పాడుకేసుతో కోర్టు చుట్టూ తిరగవలసిన గతి పడుతుంది. ఎందుకీ లేనిపోని గొడవ!' అనుకున్నాడు.

"నీకు పుణ్యం ఉంటుందిగాని ఆ కోర్టు వ్యవహారాలు నాకు తగిలించవద్దు. ఆ మహాతల్లిని ఇక్కడికే పిలిపించు. ఇక్కడే ఉండనీ. నాకేం అభ్యంతరంలేదు" అన్నాడు ప్రాధేయపడుతూ.

"ఒక షరతు. ఆమెకు మీ అర్ధాంగిగా సకల సౌకర్యాలు కలగాలి. ఆమె జీవితంలో అసంతృప్తి ఏర్పడిందా . . ."

"ఏం చేస్తావేం? . . ."

"ఏం చేస్తానా? అది తరవాత సంగతి. కాని మా సేవకురాలుగా ఉండాలనా మీ ఉద్దేశ్యం?" కోపంగా అడిగింది.

"ఆగాగు! ఆవిడగారి ఇష్టం వచ్చినట్టు, నీ ఇష్టం వచ్చినట్టు ఉండనీ, సరేనా?"

కొద్దిగా నవ్వు వచ్చింది శాంతకు రవి మాటలకు. కష్టంమీద ఆ నవ్వు అదిమిపెట్టుకుని అంది: "మీ ఇంట్లోనే ఉంది. నేను ప్రతిరోజూ వచ్చి చూసి పోతూంటాను" అంది తెచ్చిపెట్టుకున్న గంభీరతతో.

'అరే! నిజమా?' అన్నట్టు చూశాడు.

"నిజం!" అంది శాంత నవ్వుతూ.

"శాంతా! ఒక్క మాట చెబుతా వింటావా?"

"ఏమిటి మహానుభావా?"

"మరేంలేదు. స్త్రీ సృష్టిలో విచిత్రమైనది. సరే, నువ్వు నీ జాతిలో అందరికన్న చాలా విచిత్రమయిన *దానివి! అయితే నీ మూలాన నా కో విషయం బోధ* పడింది."

"ఏమిటది?"

"స్త్రీ ఈర్ష్యాసూయలవలెనే సానుభూతికూడా హద్దులేనిది. నీలో ఈర్ష్యాసూయల స్థానంలోకూడా ప్రేమ సానుభూతులే నిండిఉన్నాయి అని."

"ఎందుకని?"

"మరి నీ సవితిని గర్హించకుండా నెత్తిమీద కెక్కించుకుంటున్నావేం?"

"ఎవరు సవితి?"

"ఇంకెవరు? మాధవే!"

"ఛీ, ఛీ, మీకు బుద్ధిలేదు" అంటూ వెళ్లిపోయింది.

శాంతను గురించే ఆలోచిస్తూ కూర్చున్నాడు. 'నిజంగా చాలా ధైర్యవంతురాలే. లేకపోతే నా అనుమతి లేకుండా నా ఇంట్లో మాధవిని పిలిపించడమా? ఆ తరవాత నాపై అధికారమా? వయస్సు చిన్నదయినా ఎందుకో ఆ దర్పం, ఆ ఠీవి, ఆ అధికారం? ఏమయినా రాజఠీవి ఉంది శాంతలో. తప్పబుట్టింది సామాన్య మానవులలో. మహారాజ్ఞిగా పుట్టి ఉండవలసింది' అనిపించింది రవికి.

* * *

మాధవి ఆలోచించుకుంది. శాంత కొన్ని సలహాలను ఇచ్చింది. "రవి ఇంట్లోనే ఉండు. రవికి అన్ని సదుపాయాలు అమరుస్తూ, సౌకర్యం కలిగించు. కాని రవి కంటికిమాత్రం కనపడకుండా మెలుగు. అతను తప్పక దారికి వస్తాడు. అతని అమాయికత నిన్ను తమ్మని పిలిచిన తీరులోనే ఉంది. ఇటువంటి వ్యక్తులను ఓర్పుతో, సహనంతో, నేర్పుతో జయించాలిగాని, బలవంతం పనికిరాదు. ఇది నీ స్త్రీత్వానికే ఒక పరీక్ష. నీ నేర్పుతో, శక్తితో గెలిచావా నీకు అమృతంవంటి జీవితం! లేదా హాలాహలమే మరి! వస్తా, చెల్లీ. ధైర్యంగా ఉండు. నేను ప్రతిరోజూ వచ్చి చూసిపోతాను మరి." శాంత వెళ్లిపోయింది.

'అవును. నిజమే! అక్క చెప్పినట్లు నడుచుకుని చూస్తాను. అదృష్టం ఉంటే బాగుపడతాను. లేదా సరేసరి' అనుకుంది అప్పుడే కొద్ది కొద్దిగా ఆత్మస్థైర్యం పొందుతున్న మాధవి.

ఆలోచనాస్రవంతి తననుండి శాంతపై పార్లింది. 'అయినా ఈ సుకుమారి తనకొరకు ఎందు కింత పాటుపడుతూంది? నేను ఈమె ఋణం ఏ విధంగా తీర్చుకోగలను? అక్క చాలా విచిత్రమైన వ్యక్తి. స్త్రీలలోకూడా ఇటువంటి పవిత్రులు ఉన్నారా?

ఇంకా పొడుగు ఎదగండి



నూతన శాస్త్రపద్ధతులతో వ్యాయామములతో ఎక్కువ పొడుగు కండి. ఆరోగ్యవంతులవండి. స్త్రీ పురుషులకు ఎల్లరకు అనువైనవి. దీని వంటి కోర్సు, లేక పుస్తకం మరొకటి ఎంతమాత్రంలేదు. వివరములు ఇంగ్లీషులోగాని తెలుగులోగాని ఉచితం.

TOTAL HEALTH,
283, Azad Market (AVP), Delhi-6.

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సాతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

DOL-337 TEL

మీకు సంతానం లేదా!



స్త్రీ సంజీవి నెం. 2
సంతాననిధి

అమూల్యము, శక్తివంతమునైన మూలికల యోగము. ఆపరేషన్లు చేయించి, విసిగి చెందిన సోదరీమణులు సంతానవతులై యోగ్యతాపత్రము లిచ్చియున్నారు.
వెల: రు. 10/- పోస్టేజి ప్యాకింగ్ అదనం.
శ్రీ నాగార్జున మూలికా కుటీరం,
రైల్వేస్టేషను వద్ద, రామాలయం, తెనాలి-2.

...యత్నం గ్రహించిన ...నడుముపై చెయ్యివేసి

దేవుని దయవల్ల ఈ అక్క సాహచర్యంతో నా జీవితమే కనక బాగుపడితే, ఇంతగా సాయపడిన అక్కకు తప్పక సుఖం కలిగేట్లు ప్రయత్నాలు చెయ్యాలి' అనుకుంది అమాయికురాలైన మాధవి మనస్సులో. ఆశ చిగురించే నమ్మకం కలగడంతో శాంతస్సై ఎనలేని భక్తిభావంతో పాటు కృతజ్ఞత, అసమానమైన ప్రేమ, అభిమానము ముంచుకువచ్చాయి.

* * *

పదిహేనురోజులు గడిచిపోయాయి. ఇంతవరకు రవి, మాధవి ఒకరికొకరు ఎదురుపడలేదు. రవి హృదయంలో ఏర్పడిన కసి, ఉక్రోషం కాలయాపనతో కరిగిపోయింది. దానిస్థానే ఆశ్చర్యం, కుతూహలం ప్రవేశించాయి. నిర్లక్ష్యం చేద్దామనుకున్నవాడికి తప్పనిసరిగా లక్ష్యంచెయ్యవలసిన అవసరం ఏర్పడింది. మానవుడుగా దేవుడిచ్చిన మెదడు ఉపయోగించకుండా ఉండలేకపోయాడు. తన దైనందిన జీవితంలో అడుగడుగున ఎదురవుతున్న పరిస్థితుల మార్పులతో అతని మూర్ఖపు పట్టుదల ఆటవిడుపులోకి వచ్చింది. తన మొండితనంవల్ల, అజ్ఞానంవల్ల అనవసరంగా అజ్ఞాతవాసం చేస్తున్న భార్యామణిపై ప్రప్రథమంగా సానుభూతి కలిగింది. సానుభూతి దయకు దారి ఇచ్చింది. దయతో అనురాగం వచ్చి కలిసింది. అనురాగంతో అన్వేషణ బయలుదేరింది.


ప్రొద్దున్న లేచీ లేవగానే టూత్‌బ్రష్, టవల్, సోపు కనిపించేవి ఎదురుగా. కడుక్కుని వచ్చేసరికి కాఫీ సిద్ధంగా ఉండేది. తొమ్మిదింటికి స్నానానికి వేణ్ణీళ్ళు సిద్ధం చేసిన పిలుపు వచ్చేది. తొమ్మిదిన్నర గంటలకు కాఫీ, టిఫిన్ మళ్ళా సిద్ధంగా కన్పించేవి. స్నానంచేసి వచ్చేలోపల బట్టలుకూడా ఎదురుగా అమర్చిఉండేవి. తన పనివాడి చురుకుతనం తనకు బాగా తెలుసు. ఈ పదిహేనురోజులు ఇంద్రజాలంలా అన్నీ కన్పించింది. వారంరోజులదాకా తప్పించుకు తిరుగుదామన్న తన నిర్లక్ష్యాన్ని మార్చుకొని ఎలాగయినా మాధవిని కలుసుకుని ఎదురుగా కూర్చోపెట్టుకుని తీయగా, హాయిగా మాట్లాడాలనే కోర్కె, పట్టుదల ఎక్కువయ్యాయి.

ఎంతో మెలకువతో తన అజ్ఞాతవాసాన్ని నిలుపుకుంటున్న మాధవి రవి అమాయిక ప్రయత్నాలకు పట్టుబడలేదు. మాధవికోసం ప్రయత్నించి విసిగిపోయిన రవి ఆశ్చర్యపోయాడు. 'తన ఇల్లే మయసభలా మారినట్టుందే! లేకపోతే నాలుగు గదులు లేని తన ఇంట్లోనే ఈ మాధవి తన కంటపడకుండా ఎలా ఉండగలుగుతూంది? విచిత్రంగా ఉందే? మాధవికి తన హృదయం మారిందని ఎలా తెలియజెప్పను?' అనుకున్నాడు సగం బాధపడుతూ, సగం ఆశ్చర్యపడుతూ. 'బలవంతంగా వచ్చింది. ఒత్తిడి చెయ్యకపోగా దూరంగా పోవడంలో అర్థమేమిటో? బహుశా నిరాశా నిస్పృహలు ఆవేదనతో దూరంగా నిలిపిందేమో? పాపం!' అనుకున్నాడు.

ఆరోజు రాత్రి తన చిత్రశాలలో మాధవి నగ్న చిత్రాన్ని చూస్తూ ఆలోచనలలో మునిగిపోయాడు. మాధవి ముఖాన్నే చూస్తూఉంటే వెలుగులా ఒక ఆలోచన జొరబడింది. 'అమాయికురాలైన నిన్ను వంచించిమున్నితమయిన నీ మనస్సును నొప్పించినందుకే దైవము నాకీ అశాంతిని ప్రసాదించాడేమో! నన్ను క్షమించి నా ఎదుట కనబడవూ?' మొదటిసారిగా భార్య రూపకల్పన ముందర ప్రార్థించాడు. అశాంతితో ఆవేదనతో అలసటచెందిన అతని హృదయం మెల్లిగా బల్లపై వాలి విశ్రాంతి తీసుకొంది.

రేగిన జుట్టుతో, నలిగిన బట్టలతో, అలసట చెందిన ముఖంతో భర్త రూపాన్ని జాలిగొలిపే స్థితిలో చూసిన మాధవి హృదయం అపారమయిన ప్రేమతో ద్రవించి పోయింది. జవాను సహాయంతో పడకగదిలో చేర్పించి దుప్పటి కప్పి రెండుక్షణాలు భర్తను పరీక్షగా చూసింది.

అంతలో మనస్సులో ఏదో మెదిలి రవి చిత్రశాలకు వచ్చింది. నగ్నంగా ఉన్న తన చిత్రం చూసి సిగ్గుతో కుంగిపోయింది. రవి లేని సమయంలో కొంచెం కొంచెంగా ప్రయత్నించి చిత్రలేఖనంలో ప్రవేశం సంపాదించుకుంది. భర్త అభిరుచి భార్య అభిరుచిగా మారడంలో ఆలస్యం కాలేదు. త్వరలోనే కొద్దిగా ప్రావీణ్యాన్నికూడా సంపాదించుకుంది. ఆ ధైర్యంతోనే తన ప్రతిరూపానికి తానే వస్త్రాలంకారం చెయ్యాలని కుంచె తీసుకుని రంగుల్ని కలిపింది. పసుపుతో ఎరుపు కలిపి ఆరంజ్ కలర్ చేసింది. దానికి రోజారంగు కలిపింది. కాస్త తెలుపు కలిపింది. వచ్చిన ఆకర్షణీయమయిన రంగుని



గోడలు చెప్పే కోమల గాథలు —ఫోటో: కె. వి. రామమోహన్‌రావు (భువనేశ్వర్)

చీరగా ధరింపజేసింది. బంగారువన్నెతో చామంతిపూలు అక్కడక్కడ వేసింది. రోజారంగులో బంగారువన్నె అంచుతో బ్లౌజు వేసింది. పని పూర్తిఅయ్యేసరికి రాత్రి మూడుగంటలు అయింది. సగం ప్రావీణ్యంతో, సగం పొరపాటువల్ల ఏర్పడిన రంగులలోని హెచ్చుతగ్గులతో చీరకుచ్చెళ్ళలోని నీడలను సూచిస్తూ చిత్రకారుని మెప్పుదలకు కావలసిన కారణం చూపిస్తూంది. పని పూర్తిఅయిన తరవాత మాధవికి భయమేసింది. 'తను చిత్రం పాడుచేసిందని రవి తిడతారేమో? ఎలాగ?' అని భయపడింది.

కాని కాని . . . . తను ఎలా సహించగలదు? తను పవిత్ర భారతావనిలో జన్మించిన హిందూస్త్రీ. తన మానాన్ని ఆ విధంగా నలుగురి మెప్పుదలకొరకు ఖర్చు పెట్టగలదా? భరించలేని విషయం. ఏమయినాసరే ఈ విషయంలో ఒప్పుకోరాదు. నిశ్చయించుకుంది. అలసిపోయి అక్కడే బల్లపై తలపెట్టి నిద్రపోయింది.

ప్రొద్దున్న అయిదింటికి రవికి మెలకువ వచ్చింది. లేచి చూసేసరికి పక్కపై ఉన్నాడు. ఎలా వచ్చాడు? బహుశా మాధవి చేసిన పనేమో అనుకుని జవానుని పిలిచి అడిగాడు. జవాను జరిగినదంతా చెప్పేసరికి సిగ్గుపడ్డాడు. తన మాధవి రూపాన్ని చూడాలనే ఆత్రతతో చిత్రశాలలోకి వచ్చాడు. కుంచె చేతిలో పెట్టుకుని బల్లపై నిద్రిస్తున్న మాధవిని చూసి చకితుడయ్యాడు.

పదహారు కళలతో పూర్ణచంద్రుడులా కలకలలాడవలసిన మాధవి వదనం ఏకకళతో క్షీణించిపోయి కనిపించింది. కాని ప్రేమామృతసాగరాన్ని నింపుకున్న ఆ కళాకారుని అంతర్దృష్టికి అపూర్వమయిన శోభ ఆ నీరసించిన ముఖంలో కనిపించింది. మాధవిపై నుండి దృష్టి చిత్రఫలకంపైకి పోయింది. అత్యంత రమణీయంగా నూతన కాంతులను వెదజిమ్ముతూ వలువలు ధరింపజేయబడిన మాధవి వర్ణచిత్రం నవ్వుతూ పలకరించినట్లయింది. అవాక్కే అయ్యాడు ఆ వర్ణమిశ్రమానికి, అపూర్వమయిన ఆ అమాఘ్య ప్రావీణ్యానికి.

'ఓ నా ప్రియమాధవీ! నువ్వు చిత్రకారిణివి కూడానా?' మనస్సు ప్రేమానందోత్సాహాలతో ఉప్పొంగిపోయింది.

మృదువుగా ఎత్తుకుని పడకగదికి తీసుకునిపోయి పరుండబెట్టాడు. గాఢనిద్రలో ఉన్న మాధవి మేల్కొంటే బాగుండునని అనుకున్నాడు. తదేకంగా మాధవిని చూస్తూ కూర్చున్నాడు. నిద్రలో మాధవి పెదవులు చిన్నగా విడివడ్డాయి. లేత చిగురుటాకులవంటి పెదవుల కదలిక చూసేసరికి రవిలో నిద్రాణమై ఉన్న పురుష వాంఛ విజృంభించింది. అణుచుకోలేని కోరికతో మృదువుగా చుంబించాడు. ఆ చుంబనకు మేల్కొని కళ్ళు తెరిచింది మాధవి. రవిని చూసి దిగ్గున లేచింది. అకారణ భయం ఆవహించి గజగజ వణికిపోయింది. ఏదో చెప్పబోయింది. కాని రవి మాధవి చేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కాడు.

“మధూ! నన్ను క్షమించవూ! నేను నీకు చేసిన అన్యాయానికి నాకీ శిక్ష చాలు, మధూ! నేనింక సహించలేను. నన్ను నీ జీవితభాగస్వామిగా, తోడునీడగా, ప్రాణమిత్రుడుగా ఆదరించు, మధూ! ఇంకెప్పుడూ నన్ను తప్పుకుని తిరగనని మాటఇయ్యి, మధూ!” అని కరుణార్ద్రమయిన కంఠంతో అని మధు చేతిని చెంపలకు ఆనించుకుని తన్మయుడయ్యాడు.

కలలోలా అనిపించింది మాధవికి. మెల్లిగా విడిపించుకోబోయింది. మాధవి ప్రయత్నం గ్రహించిన రవి హఠాత్తుగా మాధవి నడుముపై చెయ్యివేసి

గారంగా మాధవిని హృదయానికి హత్తుకున్నాడు.

బిత్తరపోయిన మాధవి సిగ్గుతో ముకుళించుకుపోయింది.

* * *

"శాంతదగ్గిరికి వెళదాం, మధూ." దుస్తులు వేసుకుంటూ రవి అన్నాడు.

"తప్పకుండా వెళ్ళాలి. శాంతలాంటి వ్యక్తులుంటే ఈ లోకం పుణ్యమయం అయిపోయేది." ఎగిరి గంతేసి సంతోషంగా ఒప్పుకుంది.

ఇద్దరూ కలసి రావడం చూసి శాంత మొదట విస్తుపోయింది. తరవాత ఆనందం పొంగిరాగా మాధవిని గట్టిగా కౌగలించుకుంది.

"ఏం అక్కా, ప్రతిరోజూ వస్తానని మాటిచ్చి తరవాత నా ముఖమయినా చూడలేదు. నీకింకా ఒకరోజు కాలేదా?" నిష్ఠూరంగా అడిగింది.

"ఏదో పనితొందరవల్ల రాలేకపోయాను. అయినా నీకేమమ్మా! నీ జతగాడు చేయి కలిపినప్పుడు నేను వచ్చినా తిట్టుకునేదానివేగా!" చిలిపిగా అంది శాంత.

"చాల్లే! నీ కబుర్లు!" సిగ్గుపడింది మాధవి.

"శాంతా, ఇంతకీ నువ్వు నా స్నేహితురాలివా? లేక మధూ స్నేహితురాలివా?" అడిగాడు రవి వింతగా వారిద్దరివి చూసి.

"మీ స్నేహితురాలిని ఎలా అవుతాను, మాధవి అక్కయ్యనుగాని. మీ స్నేహితురాలిని అని చెప్పుకునేందుకుకూడా నాకు సిగ్గుగా ఉంది." హాస్యంగా అంది.

"అవునవును. సిగ్గెందుకుండదూ సిగ్గులేని పని చేసిన తరవాత!" ముగ్గురూ నవ్వుకున్నారు.

కాఫీ, టిఫిన్ అయిన తరవాత సినిమాకి వెళ్ళారు. దారి పొడుగునా రవి మాధవిని ఎత్తేస్తూ మాట్లాడ్డం చూసి శాంత ఆనందపడినా, ఏ మూలో ఉన్న స్త్రీ ఈర్ష్య కొద్దిగా రగిలి చివుక్కుమనిపించింది. వీడ్కోలిచ్చేటప్పుడు మరునాడు తప్పకుండా రమ్మని మరీ మరీ పిలిచి వెళ్ళింది మాధవి.

* * *

"అమ్మా! ఈ ఉత్తరం శాంతమ్మగారు ఇమ్మన్నారండీ."

"ఏం ఉత్తరం?" ఆత్రంగా విప్పి చదివింది.

"చెల్లీ, మాధవీ!

నీ సంసారం బాగుపడినందుకు నాకు ఎంత సంతోషంగా ఉందో మాటలతో నేనువర్ణించలేను. మీరిద్దరూ కన్నుల పండువుగా కలిసివస్తూంటే నా హృదయం ఆనందసాగరంలా ఉప్పొంగిపోయింది. నా జీవితం ధన్యమయిందనిపించింది. నిజం చెప్పాలంటే నాలో స్త్రీ సహజమయిన ఈర్ష్యాసూయలు రేగకపోలేదు. కాని దేవుడిచ్చిన బుద్ధి సక్రమ మార్గంలో పనిచెయ్యడం వల్ల సైతాన్ ఓడిపోయాడు. చెల్లీ! నాలుగుకాలాల పాటు సౌభాగ్యవతిగా పుత్రపౌత్రులతో కలకలలాడుతూ జీవించాలని నా హృదయపూర్వకంగా దీవిస్తున్నాను.

జన్మించినందుకు, మానవతకు చిహ్నంగా జీవించేందుకు సానుభూతే హృదయమయితే, పరోపకారమే ధ్యేయమయితే జీవితంలో నేను మానవమాత్రురాలుగా స్థానం సంపాదించుకున్నాననుకుంటాను. ఆశయాలు ఫలించడంలో అందంలేదు. అవకాశాలు కల్పించడంలో ఆత్మతృప్తి, *ఆనందం నిండిఉన్నాయి. అదే* నాకిప్పుడు లభించింది.ఇంత ఆనందాన్ని నేను భరించలేకపోతున్నాను. నిజమేనేమో! మానవుడు దుఃఖము, సుఖము విపరీతాల్లో అనుభవించలేడు.

ఒకేజాతి రెండు చెట్లలో ఒక చెట్టు ఫలించినప్పుడు రెండోది మోడుబారితే కారణం వెతకడం మేథ దుర్గుణం. అందుకే నా సంగతి నీకు చెప్పడం సబబని అనుకుంటాను. చదివి చింతించవలసిన అవసరం ఏమీలేదు. కాని మానవనైజం సానుభూతి నపేక్షించడం.

ఈ జీవితంలో నేను ఒంటరిజీవిని. నన్ను ఆదరించి ప్రేమించేవాళ్ళెవరూ లేరు. నా ప్రప్రథమ ప్రేమామృతభాండాన్ని అమాయికంగా రవిగారికి అర్పించాను. సంశయంకాని, సంకోచంకాని కలగలేదు ఆ సమయంలో. తీయటి కలలు కన్విస్తూంటే మురిసిపోయి పరవశించేదాన్ని.సర్వం ఆనందమయంగా ఉండేది. ప్రతిఫలానికై నిరీక్షించి, ఎదురయిన మౌనంతో విన్నబోయాను. అర్థంచేసుకోడానికి ప్రయత్నించడం విధిగా భావించాను. అందుకున్న ఫలాన్ని రెట్టింపుచేసి ఇవ్వలేని ఆయనగారి ఆదర్శాలను అర్థంచేసుకునేసరికి తల తిరిగిపోయింది. త్యాగంలో అందం, ఆనందం ఉందని ఆయన చేసిన బోధని విధిలేక అనుసరించాను. ఆయనకు అడ్డు రారాదని కృతనిశ్చయురాలయ్యాను. అతని నిరంతర శ్రమ, అసమానమయిన పట్టుదలవల్ల ఆయన ఆదర్శాలపై నమ్మకం ఏర్పడింది. ఆయన ప్రేమబంధాలతో ముడిపడకపోయినా జీవవాహినిలా ఎల్లప్పుడూ ఆయనవైపు ప్రసరిస్తూఉంటే చాలని తృప్తిపడ్డాను.

కాని దైవప్రేరణవల్ల నీవు ఆయన భార్యవైనావు. అది అనుకుంటే నాలో అగ్నిశిఖలే ప్రజ్వరిల్లాయి. కాని ఆ తరవాత జరిగిన సంగతులు గ్రహించిన నేను మూగబోయాను. నాటకంలా సరిపెట్టబోయిన ఆయన అమాయికతకు,అజ్ఞానానికి నాలో మొదటిసారిగా ఆయనపట్ల విరసన ఏర్పడింది. వెంటనే స్త్రీగా నా కర్తవ్య నిర్వహణ కుపక్రమించాను. ప్రేమమయి అనుకున్న స్త్రీ ఎదురుగా నిలబడి పోరాడటం తెలుసుకుని అచేతనుడే అయ్యాడు. ధైర్యస్థైర్యాలు కోల్పోగా, కర్తవ్యాన్ని గ్రహించకలిగిన రవి చాలా అమాయికుడు. మన్నించలేని స్త్రీతో పోరాడి ఓడిపోగా నీకు అమృతభాండాన్ని అందించగలిగాడు. ప్రథమ వీక్షణలో ఏర్పడిన ఈర్ష్య ఈనాడు సమూలంగా పెరికివెయ్యబడింది.ఇప్పుడు నేను నువ్వంటే ఈర్ష్యపడటంలేదు. నువ్వు అదృష్టవంతురాలివి.

"ఇప్పుడు నేను ఎవరికీ అవసరంలేనిదానను. మరొకరికి మనసీయలేని నేను, చిగిరించలేని ఆశలతో మోడుగా జీవిస్తున్నా కామెర్ల సంఘం సరిగా అర్థం చేసుకోలేక దుయ్యబడుతుంది. అనుభవాలతో బలహీనమయిన నా మనస్సు ఇంక అలాంటివాటిని ఎదుర్కొని నిలబడే శక్తిని కోల్పోయిందని నా అనుమానం. అందుకే అటువంటివాటికి అవకాశం లేకుండా నా పాత్రను ముగించదలుచుకున్నాను.

కోటి ఆశీస్సులతో,


నీ అక్కయ్య
శాంత."

చదువుకుని "అక్కయ్యా!" అంటూ విరుచుకుని పడిపోయింది. ఆ అరుపుతో కిందికి వచ్చిన రవి, మాధవి చేతిలోని ఉత్తరం చదివి మూగుడే అయ్యాడు.

★

పండిత డి. గోపాలాచార్యులవారి
అరుణ
స్త్రీల ఆరోగ్య సౌభాగ్యానికి
1898 నుండి ప్రసిద్ధిగాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
100, జి.ఎన్. రోడ్, మదరాసు 17.
1

అందమైన! అలంకరణకు!
అజంతా
(రిజిష్టర్డు)
ఆభరణములు ధరించండి
నం. 419. రు 4/-




అజంతా గోల్డు కవరింగ్ వర్క్సు
చిలకలపూడి పోస్టు మచిలీపట్నం.2.

మొటిమలు మాయమగును
చర్మము మృదువుగా శుభ్రపడును
నిక్సోడెర్మ్ (NIXODERM)ను రాసినచో మొటిమలు మాయమగును. నేటి రాత్రి నిక్సోడెర్మ్ (NIXODERM) వాడి చూచినచో చర్మము మృదువుగాను, నాజూకుగాను శుభ్రపడునని గమనించగలరు. మొటిమలు, కురుపులు, ఎర్రని మచ్చలు, దురద, తామర మొదలగువాటికి కారణభూతమగు క్రిమి జాలమును శాస్త్రోక్తముగా తయారైన నిక్సోడెర్మ్ (NIXODERM) సంహరించును. చర్మపురంధ్రములలో దాగియుండు వేరువేరు క్రిమి జాలమును తొలగించని ఎడల మీ చర్మ వ్యాధుల నివారించవు. మీ మొటిమలను నిక్సోడెర్మ్ పోగొట్టి చర్మమును మృదువుగాను, నాజూకుగాను శుభ్రము చేయు నిక్సోడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టు వద్ద కొనండి.